క్లుప్తంగా

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు



పెదరాయవరంలో కొలువైన సాయిబాబా

రంగంపేట: పెద రాయవరం గ్రామంలో కొలువైన షిరిడీ సాయికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబాను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెదరాయవరం గ్రామస్తులతో పాటు చంద్రేడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

ఎక్సైజ్ సిబ్బంది దాడి



వెంకటాపురంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గురువారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన అంచూరి ఏసు బాబు అరెస్టు చేసి, అతడి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏసు బాబుపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్టు తెలిపారు. ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయాలు సాగించినా 1440కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

బోధనోపకరణాలతో అభ్యసన సులభం



బోధనోపకరణాల మేళాను పరిశీలిస్తున్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామారెడ్డి

రాజానగరం: ప్రాథమిక స్థాయిలో చేసే బోధనను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేందుకు బోధనోపకరణాలు ఎంతగానో తోడ్పడతాయని సమగ్ర శిక్ష, కాకినాడ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామారెడ్డి అన్నారు. మండలంలోని మల్లంపూడి సాయి మాధవి ఇంజినీరింగ్ కళాశాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు తయారు చేసి, ప్రదర్శించిన బోధనోపకరణాల మేళాను ప్రారంభించారు. సుమారు వంద వరకు ఉన్న బోధనోపకరణాలను ఒక్కొక్కటిగా పరిశీలించి, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో కేఆర్పీలు వి.మహాలు, కె.ఈశ్వరరావు, ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ వంశీకృష్ణ, డీఆర్పీలు పాల్గొన్నారు.

బాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజానగరం: నియోజకవర్గంలోని సాయిబాబా మందిరాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. అన్నదాన సాయిగా పేరొందిన రాజానగరంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో వేకువజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. పలువురు తమ చిన్నారులకు పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం సిటీ: డ్రైవర్లు ప్రశాంతమైన మనసుతో డ్యూటీకి రావాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మంచి అలవాట్లు కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్బం అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి రోజూ వ్యాయామం, యోగా చేయాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యంతో ప్రమాద రహిత డ్రైవింగ్ చేయడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, ట్రాఫిక్, గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

చలికాలం.. జాగ్రత్తలే కీలకం

- పొగమంచుతో అనేక అనారోగ్యాలు
- జలుబు, జ్వరం వచ్చే అవకాశం
- దీర్ఘకాలిక రోగులు అప్రమత్తంగా ఉండాలి
- సూర్యోదయం తర్వాతే వాకింగ్ చేయాలి
- ప్రజలకు సూచిస్తున్న వైద్యులు



పందలపాకలో తెల్లవారుజామున ఇళ్లను కమ్మేసిన పొగమంచు



కొంకుదురులో మంచులో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

బిక్కవోలు: ప్రస్తుతం శీతాకాలం చివరి దశలో ఉంది. రథసప్తమి తర్వాత ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. మధ్యాహ్న సమయంలో వేడి ఎక్కువగానే ఉంటోంది. అయితే రాత్రి మాత్రం పొగమంచు విపరీతంగా ఏర్పడుతోంది. రహదారి కనిపించనంత దట్టంగా అలముకుంటోంది. రాత్రి చలి, పగటి పూట ఎండతో వాతావరణం విచిత్రంగా మారింది. ఈ నేపథ్యంలో చలి కారణంగా శ్వాసకోస వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం పగలు ఎండ మండిపోతూ, అర్ధరాత్రి దాటాక చలి పెడుతూ, తెల్లవారుజామున పొగమంచుతో వాతావరణంలో రకరకాల మార్పులు కనిస్తున్నాయి.

వ్యాధుల బారిన..

ఇటువంటి విభిన్న వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ తరుణంలో ముందుగానే తగిన జాగ్రత్తలు పాటించడం శ్రేయస్కరమని వైద్యులు చెబుతున్నారు. ఆస్తమా, ఇతర శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారు అప్రమత్తంగా ఉండాలి. వీరితో పాటు మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులతో బాధపడే వారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. చలి ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు వెళ్తే ఒక్కోసారి గుండెపోటుకు గురయ్యే ప్రమాదం ఉంది. వీలైనంత వరకూ చలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. అలాగే పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చలి ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడేవారు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలి.
- దగ్గు, జలుబు, ఆయాసం వంటివి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- తెల్లవారుజామున కాకుండా, ఎండ వచ్చిన తర్వాత వాకింగ్ చేస్తే చాలా మంచిది.
- తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే చలి బారిన పడకుండా రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలి.
- శ్వాస ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే చలికాలంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు వేడి ఆహారం తీసుకోవాలి.

పోస్ట్ కోవిడ్ రోగుల్లో దుష్ఫలితాలు

పోస్టు కోవిడ్ రోగుల్లో వేర్వేరు దుష్ఫలితాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. కొందరిలో సుగర్ లెవెల్స్ విపరీతంగా పెరుగుతున్నాయి.మరి కొందరికి గుండె సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంకొందరు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ముఖ్యంగా లంగ్ ఇన్వాల్వ్ మెంట్ ఉన్నవారు చలి కాలంలో అప్రమత్తంగా ఉండకపోతే శ్వాస కోస ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 58 గ్రామాలు ఉన్నాయి. వీటిలో పదేళ్ల లోపు చిన్నారులు సుమారు 35 వేల మంది వరకు ఉన్నారు. మంచు ఎక్కువగా కురువడంతో చిన్నారుల విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నియోజకవర్గంలో 2.72 లక్షల మంది జనాభా ఉన్నారు. ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు.

శుభ్రతతోనే ఆరోగ్యం



శుభ్రతతోనే చాలా వరకూ వ్యాధులను నివారించవచ్చు. చలి కాలంలో శ్వాస కోస వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలు పొడిగా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

– జి.విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, కొంకుదురు

చిన్నారులపై అధిక ప్రభావం



తెల్లవారుజామున మంచు అధికంగా కురుస్తోంది. దీనివల్ల చిన్నారులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. జలుబు, జ్వరం ఆశిస్తున్నాయి. జ్వరం రెండు రోజుల కంటే ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులకు చూపించాలి.

– డాక్టర్ రామానంద సాగర్, చిన్న పిల్లలు నిపుణులు, అనపర్తి

నేటి నుంచి

నా కార్యకర్తలు - నా కుటుంబం



జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే

రాజానగరం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా నా కార్యకర్తలు - నా కుటుంబం పేరిట ముఖాముఖి కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. రాజానగరం మండలం సీతారామపురం నుంచి శ్రీకారం చుట్టే ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాలలోనూ విడతల వారీగా నిర్వహిస్తామన్నారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు, కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వెల్లువెత్తుతున్న నిరసన, భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చర్చిస్తామన్నారు.

బహిరంగ వేలంతో పెరిగిన ఆదాయం

బిక్కవోలు: స్థానిక లక్ష్మీ గణపతి ఆలయానికి బహిరంగ వేలంతో మరింత ఆదాయం సమకూరిందని ఈవో రామలింగ భాస్కర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆలయం వద్ద కొబ్బరి చెక్కలు, బెల్లం, పటికి బెల్లం, వస్త్రాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరి చెక్కల పాటను తోటకూర త్రినాథ. కృష్ణ గంగరాజు రూ.4.90 లక్షలకు, పటిక బెల్లం పాటను వెల్లంకి లక్ష్మీ రామచంద్రరావు రూ.3.70 లక్షలకు, వస్త్రాలకు సంబంధించి రూ.1,17 లక్షలకు పాడుకున్నారు. ఈవో మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది రూ.1.37 లక్షలు వచ్చిందన్నారు.

ఇరు వర్గాలూ సంయమనం పాటించాలి



మిర్తిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

సీతానగరం: మిర్తిపాడులో ఇరు వర్గాలూ సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయవద్దని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. ఆ గ్రామంలో ఈ నెల 2న ఘర్షణ జరిగిన ప్రాంతాలను కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్య కిషోర్, ఎస్సై డి.రామ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఎస్సీ పేట, బీసీ పేటలలో పర్యటించి స్థానికులతో పాటు కొట్లాటకు దిగిన ఇరు వర్గాలతో మాట్లాడారు. అందరూ సంయమనం పాటించాలని, రెచ్చకొట్టే ప్రయత్నాలు మానుకోవాలని, అలా కాకుండా తిరిగి ఎటువంటి ఘర్షణలు తలెత్తితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరు వర్గాల ఫిర్యాదులపై అరెస్టులు జరుగుతున్నాయని, విచారణ పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతుందన్నారు.

వర్జీనియా పొగాకు రైతులకు శిక్షణ



రఘుదేవపురంలో బ్యారన్ వద్ద క్యూరింగ్ అయిన పొగాకును పరిశీలిస్తున్న ఆర్ఎం ప్రసాద్, ఏఎస్ హేమస్మిత

సీతానగరం: వర్జీనియా పొగాకులో పక్వానికి వచ్చిన లేత గోధుమ రంగు ఆకులను రెలవాలని టుబాకో బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. రఘుదేవపురం వినాయక ఆలయం వద్ద గురువారం పొగాకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆకురెల్పు విధానం, క్యూరింగ్, గ్రేడింగ్, ఎన్‌టీఆర్ఎం పై అవగాహన కల్పించారు. దేవరపల్లి టుబాకో బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ పి.హేమస్మిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఎం ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఆకు రెలుపులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆకులకు ఎండ తగలకుండా ఉదయం 8 గంటల నుంచి 10 లోపు రెలుపు చేయాలన్నారు. ఎండలో టుబాకో ఆకులు కర్రకు అల్లరాదన్నారు. ఐటీసీ, పోలిశెట్టి, జీపీఐ కంపెనీల బయ్యర్లు రాఘవ, సీతారామరాజు, రవి మాట్లాడుతూ పొగాకులో అన్యపదార్థాలు ఉండడం వల్ల దిగుమతిదారులు పొగాకును తిరస్కరిస్తున్నారన్నారు. దీని ప్రభావం కొనుగోళ్లపై పడి ధరలు మందగిస్తున్నాయన్నారు. బేళ్ల తయారు చేసే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వర్జీనియా పొగాకు క్యూరింగ్ విధానాన్ని బేరన్ వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో టుబాకో బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ వినోద్ ప్రజాపార్టీ, ఫీల్డ్ అసిస్టెంట్ కె.సతీష్, రైతులు వేగి శ్రీనువాస్, కాట్రగడ్డ సత్యనారాయణ, పాలచర్ల వెంకట రామారావు, పాలచర్ల శ్రీధర్, అక్కిన ఆంజనేయులు, గెడ్డం రామారావు పాల్గొన్నారు.

కాటవరం

ఇసుక ర్యాంపు పరిశీలన

సీతానగరం: మండలంలోని కాటవరం ఇసుక ర్యాంపును కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా గురువారం పరిశీలించారు. ఇక్కడి నుంచి ఇసుకను కాకినాడలో స్టాక్ పాయింట్‌కు తీసుకువచ్చి, అభివృద్ధి పనులకు అందిస్తానని కాంట్రాక్టర్ టెండర్ వేశారు. అది ఖరారు కావటంతో స్టాక్ పాయింట్ వద్ద ఇసుక డంపింగ్ చేయకపోవడంతో కాంట్రాక్టర్‌ను అధికారులు నిలదీశారు. కాటవరం నుంచి ఇసుక రావడం లేదని అధికారులకు తెలపడంతో కాకినాడ జిల్లా జేసీ తరలివచ్చి, ర్యాంపును పరిశీలించారు. నీటిమట్టం తక్కువ ఉండటంతో బాటలు వేయడానికి వీలుపడుతుందని గుర్తించారు. త్వరలో బాటలు వేసి, ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

చిన్నారులకు బాలామృతం పంపిణీ



జూనియర్, సీనియర్ బాలామృతాన్ని అందజేస్తున్న ఎంపీడీఓ రూస్సీ

రాజానగరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఇచ్చే బాలామృతం మరింత ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని, జూనియర్, సీనియర్ బాలామృతం పేరుతో అందిస్తోందని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. బాలామృతంలో తాజాగా తీసుకువచ్చిన ఈ మార్పుల మేరకు తయారైన జూనియర్, సీనియర్ బాలామృతం పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని కానవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలో కానవరం కేంద్రాన్ని పైలెట్ ప్రోగ్రామ్‌కు ఎంపిక చేశారని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ టి.కనకవల్లి చెప్పారు. ఇప్పటివరకూ అందించిన బాలామృతంలోని పంచదార, పాల పౌడర్లను తొలగించి, వేయించి వేరుశెనగను కలుపుతున్నారన్నారు. ఈ విధంగా తయారైన బాలామృతాన్ని ఏడు నెలల నుంచి ఒక ఏడాది వయసున్న చిన్నారులకు జూనియర్ బాలామృతం (1500 గ్రాములు,) ఒక ఏడాది నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులకు సీనియర్ బాలామృతం (2.500 గ్రాములు) అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కే దుర్గామణి, కార్యకర్త కె.నాగమణి, పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.

లంక భూములను పరిశీలించిన అధికారులు



లంక భూములను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల ఇసుక ర్యాంపు నుంచి ప్రక్కిలంక రెవెన్యూలోని లంక భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత గురువారం పరిశీలించారు. ముగ్గళ్ల ర్యాంపు నుంచి తాళ్లపూడి మండలం ప్రక్కిలంక రెవెన్యూలోని లంక భూముల పరిశీలనకు వెళ్లారు. లంక భూముల్లో వేసిన ఇసుకను తొలగించుకుంటామని పదకొండు మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి డీఎల్ఎస్ కమిటీలోని జేసీ చిన్నరాముడు, ఆర్డీవో డాక్టర్ సుస్మిత, తాళ్లపూడి తహసీల్దార్ పి.మోహన భారతి, ఆర్ఐ కె.రామకృష్ణ, మైన్స్ సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు వాటిని పరిశీలించారు. ఆ రైతులకు సంబంధించిన 110 ఎకరాల లంకభూముల్లో ఇసుకను పరిశీలించారు. వారి వెంట కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, మైన్స్ ఏఈ మణికంఠరాజు ఉన్నారు.

రైస్ మిల్లు తనిఖీ

రఘుదేవపురంలోని వెంకటేశ్వర మోడ్రన్ రైస్ మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు గురువారం తనిఖీ చేశారు. రైస్‌మిల్లు కెపాసిటీ ఎంత, మిల్లింగ్ ఎంత జరుగుతుంది, ప్రభుత్వానికి కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఎంత అందించాలి, ఇంత వరకు ఎంత అందించారు అనే రికార్డులను పరిశీలించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంఎస్‌వో నాగలక్ష్మి ఉన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

పెదపూడి: పుట్టకొండలో ఈ నెల 8న లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం జరగనున్న నేపథ్యంలో గ్రామంలో పారిశుధ్య చర్యలను మరింత మెరుగుపర్చాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో మురుగు కాలువల్లో పూడిక, రోడ్లపై చెత్త కుప్పలు తొలగించారన్నారు.లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నేపథ్యంలో గ్రామంలోని రోడ్లను సరిచేస్తున్నారన్నారు. ఆయన వెంట సర్పంచ్ వల్లు వెంకట రమణ, సచివాలయం కార్యదర్శి గౌతమి పాల్గొన్నారు.

నిలిచిన ఇసుక తవ్వకాలు

సీతానగరం: వంగలపూడి ర్యాంపులోని రీచ్–2లో ఇసుక తవ్వకాలు గురువారం నిలిచిపోయాయి. ఇక్కడి నుంచి కూలీలు ట్రాక్టర్లపై ఇసుకను ఎగుమతి చేస్తూ స్టాక్ పాయింట్ల వద్ద డంపింగ్ చేస్తున్నారు. అయితే గురువారం ఉదయం వంగలపూడి గ్రామానికి చెందిన ట్రాక్టర్లపై కూలీలు ఇసుక ఎగుమతి చేయడం లేదని ఆరోపిస్తూ ట్రాక్టర్లను అడ్డుగా పెట్టారు. దీనితో ఉదయం 7 నుంచి పది గంటల వరకు తవ్వకాలు నిలిచాయి. అయితే కూలీలు స్వచ్ఛందంగా ఈ రోజు తవ్వకాలు జరపలేమని చెప్పడంతో స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను మాత్రమే పొక్లెయిన్‌తో లారీలలో లోడ్ చేసి ఎగుమతి చేస్తున్నారు.

నేడు ఐఓసీఎల్ మాక్ డ్రిల్

మధురపూడి: ప్రత్తిపాడు మండలం ధర్మవరం ఐఓసీఎల్ పైప్‌లైన్ 773 కిలోమీటరు వద్ద శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్టు మేనేజర్ మిథున్ కుమార్ తెలిపారు. ఈ మాక్ డ్రిల్ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేస్తున్నామన్నారు. పైప్‌లైన్ నుంచి ఇంధనం లీకయితే జరగబోయే ప్రమాదాన్ని ఎదుర్కోవడంపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

నేడు వారాహీదేవి విగ్రహ ప్రాణప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని వారాహీదేవి పీఠం వ్యవస్థాపకులు పామర్తి బాబూరావు, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా శుక్రవారం ఉదయం 11.26 గంటలకు వారాహీదేవి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరగనుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు పూర్ణాహుతితో ముగింపు నిర్వహిస్తారు. కాగా.. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

ఈవెంట్స్ మీడియాతో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం

కంబాలచెరువు: హైదరాబాద్‌లోని ఇండల్జెన్స్ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మీడియాతో స్థానిక ఆర్ట్స్ కళాశాల వాణిజ్య – మేనేజ్‌మెంట్ విభాగం గురువారం అవగాహనా ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఈ ఒప్పందంతో బీబీఏ (ఈవెంట్ మేనేజ్‌మెంట్) విద్యార్థులకు పరిశ్రమ అనుభవాన్ని అందించేందుకు శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్రచారం, బ్రాండ్ మార్కెటింగ్‌లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. అనంతరం ఇండల్జెన్స్ ఈవెంట్స్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిపుణులు మాట్లాడుతూ పరిశ్రమలోకి వస్తున్న కొత్త ధోరణులు, వ్యూహాత్మక ప్రణాళిక, బడ్జెటింగ్, మార్కెటింగ్ వ్యూహాలు, కెరీర్ అవకాశాలను వివరించారు. బీబీఏ సమన్వయకర్త డాక్టర్ పి.సునంద, బీబీఏ ఈఎం ప్రోగ్రామ్స్ స్ట్రీమ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.ప్రతిమ మాట్లాడారు. కార్యక్రమంలో వాణిజ్య – మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, డాక్టర్ పి.షణ్ముఖరావు, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రామచంద్ర తదితరులు

టూటౌన్.. వెల్ డన్..

- నేరగాళ్లపై నిరంతర నిఘా
- శాంతిభద్రతల పరిరక్షణలో కీలకం
- గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరు ఆదర్శనీయం



రాజమహేంద్రవరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్

కంబాలచెరువు: సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరానికి నిరంతరం అనేక మంది ప్రజలు వస్తుంటారు. ఇక్కడ చారిత్రక గుర్తులతో పాటు వ్యాపార వాణిజ్యాల జోరుగా ఎక్కువగా ఉంటుంది. నగరంలో అనేక ప్రముఖ ఆస్పత్రులు, విద్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ హోల్ సేల్ వస్త్ర దుకాణాలకు ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు, ప్రజలు తరలివస్తారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు, ప్రజలు రాజమహేంద్రవరం ప్రవేశ ద్వారమైన కోటిపల్లి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో దిగుతారు. అక్కడి నుంచి నగరంలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. ఈ నేపథ్యంలో ఈ రెండు ప్రదేశాలూ భద్రతాపరంగా ఎంతో కీలకంగా ఉంటాయి.

టూటౌన్ పోలీస్ స్టేషన్ కీలకం

ఎంతో కీలకమైన ఆ రెండు ప్రదేశాలూ టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. వీటితో పాటు వైశాల్యం రీత్యా ఈ పోలీస్ స్టేషన్ పరిధి చాలా ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి చోట శాంతిభద్రతల పర్యవేక్షణ కత్తిమీద సామే. అయితే జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్, అధికారుల సమన్వయంతో విజయవంతంగా శాంతిభద్రతల పరిరక్షణ జరుగుతోంది. గతంలో కొట్లాటలకు, బ్లేడ్‌బ్యాచ్‌లకు, నేరగాళ్లకు నిలయంగా ఉండే ప్రాంతం ఇప్పుడు ప్రశాంత వాతావరణంలోకి మారింది. దీని వెనుక పర్యవేక్షణాధికారులతో పాటు స్టేషన్ సీఐ, సిబ్బంది పాత్ర ఎంతో ఉంది.

గంజాయి కేసులో..

టూటౌన్ స్టేషన్ పరిధిలో ఆల్కాట్ తోట, ఇన్నీసుపేట, నక్కలదొడ్డి, వీరభద్రపురం, బాలాజీపేట వంటి ప్రాంతాలు కీలకం. ప్రధాన రైల్వేస్టేషన్‌కు ఈ ప్రాంతాలు ఆనుకుని ఉండడంతో చోరీలకు పాల్పడే వ్యక్తులతో పాటు గంజాయి విక్రయాలు కూడా గతంలో ఉండేవి. ఇటీవల గంజాయి అమ్మకాలపై స్టేషన్ అధికారి ఉక్కుపాదం మోపారు. దీనిలో భాగంగా గంజాయి సేవించే వారిని విచారించి, వారి ద్వారా గంజాయి విక్రయం చేస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఇలా ఇటీవల మొత్తం 17 మంది గంజాయి వ్యాపారులపై కేసులు నమోదు చేసి కటకటాల వెనుక పెట్టారు.


బ్యాంకుల వద్ద భద్రత

జిల్లా పరిధిలో రైలు, బస్సు మార్గాలకు దగ్గర ఉన్న టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే మొత్తం 26 బ్యాంకింగ్ సంస్థలు ఉన్నాయి. దీనితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. ఇక్కడ నిత్యం కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతుంటాయి. గతంలో బ్యాంకుల్లో నగలు తీసుకోవడానికి వచ్చే ఖాతాదారులను ఏమార్చి లక్షల రూపాయలను దొంగలు కొల్లగొట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. స్టేషన్ సిబ్బంది ప్రణాళికాబద్ధంగా నిరంతర గస్తీ నిర్వహించడంతో ఇది సాధ్యమైంది. గతంలో గోదావరి తీర ప్రాంతమైన గౌతమీ ఘాట్, రోడ్డు కం రైల్వే వంతెన ఆత్మహత్యలకు కేంద్రంగా ఉండేది. అక్కడ మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో ఆత్మహత్యల నివారణ సాధ్యపడింది.

మహిళలకు రక్షణ

టూటౌన్ పరిధిలో ప్రభుత్వ జూనియర్, వీటీ, సంహిత తదితర కళాశాలలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి చదువు కోసం వచ్చే విద్యార్థులు కోటిపల్లి బస్టాండ్‌లో దిగుతుంటారు. వీరిని ఆకతాయిలు వేధించకుండా కళాశాల ప్రారంభం, ముగింపు సమయాల్లో మహిళా రక్షక్‌తో గస్తీ ఏర్పాటు చేస్తుండడంతో వేధింపులు తగ్గాయి.

సిబ్బంది కృషితోనే సాధ్యం



టూటౌన్ పరిధిలో సీసీ కెమెరాలను పటిష్టం చేశాం. రైల్వే స్టేషన్ వద్ద పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశాం. నిరంతర గస్తీ ఏర్పాటు చేసి సత్ఫలితాలు సాధిస్తున్నాం. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడడం లేదు. ఫిర్యాదు అందిన 10 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకునేలా సిబ్బందిని ప్రణాళికబద్ధంగా ఉపయోగిస్తున్నాం. బ్లేడ్ బ్యాచ్, గంజాయి పొట్లాల విక్రయాలు కలిపే ఆకతాయి యువకులపైనా కేసులు నమోదు చేస్తున్నాం. నేరాలను నియంత్రణకు పోలీసు సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారు.

– కె.మంగాదేవి, ఇన్‌చార్జి టూటౌన్ సీఐ, రాజమహేంద్రవరం